క్లుప్తంగా

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రంలో 20 శాతం ఉన్న యాదవ కులస్తులకు యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ మ్యానిఫెస్టోలో యాదవ కార్పొరేషన్ అంశం పెట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి జంగ కొమురయ్య, తిరుపతి, పరుషరాం, సదానందం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం ఎస్సెస్సీ విద్యార్థులకు ఎన్‌సీసీ అధికారి, పాఠశాల పూర్వ విద్యార్థి రేల్ల సంజీవ్ పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందించారు. విద్యార్థులందరూ క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. రాబోయే ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో 10జీపీఏ సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుక రావాలని కోరారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లతో పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెర్లభూత్కూర్ ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, ప్రధానోపాధ్యాయుడు కోట లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేకుర్తి ఆసుపత్రిలో మెల్ల కన్నుకు చికిత్స

కొత్తపల్లి: కరీంనగర్ రేకుర్తి లయన్స్ కంటి ఉదార ఆసుపత్రిలో మెల్ల కన్ను, చిన్న పిల్లల కంటి సమస్యలు, చిన్న పిల్లల్లో శుక్లం (మోతెబిందు)కు ఈనెల 6న చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆ వైద్యశాల చైర్మన్ కె.వేణుమూర్తి, ఇంజినీర్ కోల అన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన ప్రత్యేక వైద్యుడు వస్తున్నారని, చికిత్స చేయించుకునే వారు 76739 83940 సెల్ నంబర్‌ను సంప్రదించి అపాయింట్‌మెంట్ పొందవచ్చునని పేర్కొన్నారు.

నియామకం



అజయ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా గన్నేరువరం మండలం హన్మాజిపల్లెకు చెందిన అజయ్ నియామకమయ్యారు.ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

'వింధ్యావాలీ'లో ముందస్తు హోలీ సంబురాలు



సప్తగిరికాలనీ(కరీంనగర్): మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో నిర్వహిస్తున్న వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శనివారం వలంటీర్లు శ్రమదానం చేపట్టారు. ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ బోగొండ లక్ష్మి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్రమశిక్షణతో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, సత్యనారాయణ, లింగరావు, శ్రీనివాస్, రమేశ్, కుమార్, చారి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్నాం.. నేర్పిస్తాం

- కొత్త క్రీడలు, రూల్స్‌పై అవగాహన పెంచుకున్న పీఈటీలు



వాలీబాల్‌లో తలపడుతున్న పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పీఈటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: 'కొత్త క్రీడలపై అవగాహన కలిగింది.. రూల్స్ ఎంతో తెలుసుకున్నాం. నయా టెక్నిక్‌లు కూడా నేర్చుకున్నాం.. కార్డియాలజీ, ఫిజియోథెరపీ ఎలా చేయాలో తెలిసింది.. రెండు రోజుల పాటు జరిగిన సెమినార్ మాకెంతో ఉపయోగపడింది' అంటూ ఆనందం వ్యక్తం చేశారు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు పీఈటీలు. తాము నేర్చుకున్న పాఠాలు స్కూల్‌లో విద్యార్థులకు నేర్పిస్తామని పేర్కొన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (తెలంగాణ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో రెండురోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని పీఈటీ, పీడీలకు సెమినార్, క్రీడలు నిర్వహించగా, సుమారు 250 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించింది. ఇలాంటి సెమినార్‌లు ఏటా నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

చాలా నేర్చుకున్నాం



రెండు రోజుల పాటు జరిగిన సెమినార్, క్రీడల్లో మేము చాలా నేర్చుకున్నాం. ఫిజియోథెరపీ, హెల్త్ ఎడ్యుకేషన్, యోగ, కార్డియాలజీ తదితర అంశాలు ఎంతో ఉపయోగపడుతాయి. విద్యార్థులకు అవసరమైన అంశాలన్నీ సెమినార్‌లో చెప్పారు. 100 మీటర్ల రన్నింగ్, రీలేలో రజత పతకాలు సాధించా.

– జి.నిర్మల, పీఈటీ, జెడ్పీహెచ్ఎస్, నవాబ్‌పేట

ఏటా నిర్వహించాలి



పీఈటీలకు ఎంతో ఉపయోగపడే క్లీనిక్ ఇది. ఇలాంటివి ఏటా నిర్వహించాలి. ఎన్నో రకాల క్రీడలు వస్తున్నాయ్, రూల్స్ మారుతున్నాయి. పిల్లలందరికీ అప్‌డేట్ చేయాలంటే ఇలాంటి క్లీనిక్ వల్లనే సాధ్యం. డిస్క్, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించా.

– వి.రూపారాణి, పీఈటీ, జెడ్పీహెచ్ఎస్, రుద్రారం

వాలీబాల్‌లో రన్నరప్..



స్కూల్, కాలేజీ చదివే రోజుల్లో స్పోర్ట్‌మీట్‌లో పాల్గొన్నా. మళ్లీ ఇప్పుడు పాల్గొనడం సంతోషంగా ఉంది. పిల్లలకు స్కూల్‌లో రోజు ప్రాక్టీస్ చేయిస్తున్నా. వాలీబాల్‌లో పెద్దపల్లి జిల్లాకు సెకండ్ ప్లేస్ సాధించి పెట్టా.

– టి.కుమార్, పీఈటీ, జెడ్పీహెచ్ఎస్, కటికనపల్లి

స్టేట్ లెవల్‌లో నిర్వహిస్తాం



అందరి సహకారంతో జిల్లా పెటా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పిఈటీల సెమినార్, క్రీడలు సక్సెస్‌గా జరిగాయి. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ లో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తాం.

– ఎండీ యూనిష్‌పాషా, పెటా టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



మండల పరిషత్ సమావేశంలో నేలపై బైఠాయించిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

- మండల సమావేశంలో నేలపై బైఠాయించి ఆందోళన

కరీంనగర్‌రూరల్: మండల పరిషత్ సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన సభ్యులు నేలపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో సభ్యులు ఆందోళన విరమించారు. శనివారం ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అధ్యక్షతన కరీంనగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభించగా రైతులందరికీ యాసంగి రైతుబంధు రాలేదని మొగ్ధుంపూర్ సర్పంచ్ జక్కం నర్సయ్య తెలిపారు. ధరణి సమస్యలను పరిష్కరించడంపై సమగ్ర నివేదికను వారం రోజుల్లో అందిస్తానని తహసీల్దార్ వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మండల సమావేశాలకు గైర్హాజరు కావడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని చెర్లభూత్కూర్, నగునూరు ఎంపీటీసీలు బుర్ర తిరుపతిగౌడ్, సాయిల్ల వినయ్‌సాగర్, అంకమల్ల శ్రీనివాస్‌లు ఆరోపించారు. అధికారులు వస్తేనే సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎంపీటీసీ సభ్యులు నేలపై బైఠాయించగా మిగితా సర్పంచులు సైతం మద్దతు ప్రకటించారు. గత మూడు సమావేశాలకు ఆర్‌అండ్‌బీ అధికారులు రాలేదని ఆరోపించారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఈనెల 6న ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో సభ్యులు ఆందోళన విరమించారు. ఉప సర్పంచ్ చెక్కులపై సంతకం చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఇరుకుల్ల సర్పంచ్ బలుసుల శారద నేలపై కూర్చొని నిరసన తెలుపగా పరిష్కరిస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. నగునూరుకు భగీరథ నీరు రావడంలేదని ఎంపీటీసీ వినయ్‌సాగర్, చెర్లభూత్కూర్‌లో ఇంట్రావిలేజ్ కింద నల్లా కనెక్షన్లు ఇవ్వలేదని సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి తెలిపారు. మరియపురంలో భగీరథ నీరు రావడంలేదని చెప్పగా మండల పరిషత్ నిధుల నుంచి బోరు వేసేందుకు ఎంపీపీ అన్నారు. చెర్లభూత్కూర్, చామనపల్లి గ్రామాల్లో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగెలు తొలగించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి మంజూరుకు పంపినట్లు మొగ్ధుంపూర్ సబ్‌స్టేషన్ ఏఈ నరేశ్ తెలిపారు. గోపాల్‌పూర్‌లో విద్యుత్ స్తంభాలను మార్చేందుకు చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, సర్పంచ్ ఊరడి మంజుల కోరగా ఎస్టిమెట్ రూపొందించినట్లు బొమ్మకల్ ఏఈ తిరుపతి వివరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ రమణారెడ్డి, భగీరథ ఏఈ సూర్యప్రకాశ్, ఎంఈవో మధుసూదనచారి, పశువైద్యాధికారి రామకృష్ణ, ఏవో సత్యం, ఏపీవో శోభ, ఐకేపీ ఏపీఎం భువనచంద్ర, కరీంనగర్, దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్లు శ్యాంసుందర్‌రెడ్డి, గోనె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పిన మంత్రి కమలాకర్

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)లో చేరుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం మంత్రి మీ సేవా కార్యాలయంలో కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏడవ వార్డు సభ్యుడు మొనిక కిరణ్ గులాబీ గూటికి చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్‌కు స్థానం లేదని, మళ్లీ రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుడా డైరెక్టర్ షేక్ యూసఫ్, టి.శ్రీనివాస్, శంకరాచారి, నరేందర్, పున్ని యాదవ్, మల్లేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవ వేడుకలు



వాణీనికేతన్ బాల విహార్ పాఠశాలలో..



మోడల్ హైస్కూల్‌లో..

కరీంనగర్: ముకరంపురలోని వాణీనికేతన్ బాల విహార్ పాఠశాలలో శనివారం జష్న్ పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. వాణీనికేతన్ విద్యాసంస్థల చైర్మన్ చీటి విజయ అయోధ్య రామారావు జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రేణుక మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు 'వరాహ' రూపంలో ప్రదర్శించిన స్వాగతనృత్యం ఆకట్టుకుంది. శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నత్యాలు అదనపు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు టి. నీలకంఠం, వి.హన్మంతరావు, రవీందర్‌రావు, నారాయణరెడ్డి, కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ హైస్కూల్‌లో..

కిసాన్‌నగర్‌లోని మోడల్ హైస్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రామారావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల బృందం పనిచేస్తుందని అన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, ఎడ్ల సరిత అశోక్, వంగల శ్రీదేవి పవన్, నక్క కృష్ణ పద్మ తదితరులు పాల్గొన్నారు.







నిలువ నీడ కరువాయే..

ఎండలు మండుతున్న తరుణంలో నగరంలోని పలు చౌరస్తాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టాప్‌లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం, కమాన్ చౌరస్తా, కోర్టు చౌరస్తా తదితర బస్టాప్‌ల వద్ద చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కనీసం చలువ పందిర్లతో పాటు శాశ్వతంగా బస్టాప్‌లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఎస్సారెస్పీ కాలువలో అడ్డుకట్టల తొలగింపు



తూమును మూసివేస్తున్న రైతులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిధిలోని డీ89 ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో నీటికి అడ్డుగా ఉన్న కట్టలను శనివారం మొగ్ధుంపూర్ రైతులతో కలిసి ఎస్సారెస్పీ డీఈ సంతోశ్, ఏఈ మౌనికలు తొలగించారు. ఆయకట్టు చివరి గ్రామాలైన గొల్లపల్లి, సాంబయ్యపల్లి, మొగ్ధుంపూర్ రైతులకు నీళ్లందక పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో రుక్మాపూర్, నగునూరు, ఎలబోతారం, జూబ్లీనగర్, ఇరుకుల్ల గ్రామాల పరిధిలో కాలువలో నీటికి అడ్డుగా ఉన్న కట్టలను సరిశీలించి తొలగించారు. తూములను మూసి వేయడంతో మొగ్ధుంపూర్, గొల్లపల్లి గ్రామాలకు నీరు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్లు కె.రమేశ్‌గౌడ్, డి.లచ్చయ్య, రైతులు మీనయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యూత్‌ఫెస్ట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వివేకానంద కళాశాల యాజమాన్యం

శాతవాహనయూనివర్సిటీ: ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మేధ-2023 రాష్ట్రస్థాయి యూత్ ఫెస్ట్‌లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు ఆక్టివ్ పార్టీసిపేషన్ అవార్డును గెలుచుకున్నారన్నారు. వాసవీ, పూజ, వైష్ణవి, మనిదీప్, నిశాంత్, రాజ్కుమల్, దీపక్, కుషాల్, ముస్తాక్, ఇంజామమ్, అశ్రిత, కునాల్, అరవింద్, మనిషరన్, ఆర్షిత్, లహరి, తేజస్విని, అనూష, మనీషలు పలు విభాగాల్లో బహుమతులు సాధించారన్నారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, శ్రవణ్‌కుమార్, రామేశ్వర్‌రావు, అధ్యాపక బృందం అభినందించారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని రేకుర్తిలో గల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని కాపాడి అర్హులైన పేద ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తహసీల్దార్ జి.లక్ష్మీనరసింహారావుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రేకుర్తిలోని 55, 132, 133, 134, 137 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా షెడ్లు, ప్రహరీ, రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తూ ఆక్రమిస్తున్నారని, ఆ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు దుర్గం మారుతి డిమాండ్ చేశారు. కరీంనగర్ కార్పొరేషన్, గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రేకుర్తిలోని ప్రభుత్వ, నిషేధిత భూముల వివరాలు పంపించి భూ కబ్జాకు గురికాకుండా, అందులో అనుమతిలేని నిర్మాణాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కుమార్, రవీందర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


అత్తింటి వేధింపులపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం: తనను ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భర్తతో పాటు అత్తింటి వేధింపులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కరీంనగర్ బోయవాడకు చెందిన ఆరెల్ల అనిత శనివారం సీపీ సుబ్బారాయుడుకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అనిత, నదీం అహ్మద్‌లు 2019లో ప్రేమ వివాహం చేసుకున్నారు. 2021లో భర్తతో పాటు అతడి కుటుంబసభ్యుల వేధింపులు అధికమయ్యాయి. 2021 డిసెంబర్‌లో బాధితురాలు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దమనుషుల సమక్షంలో రిజిస్ట్రేషన్ మ్యారేజీ చేసుకున్నారు. కొద్దిరోజులు బాగానే ఉన్నా ఇటీవల మళ్లీ వేధింపులు అధికమయ్యాయి. నీకు సంతానం కాదని, కులం పేరుతో దూషించడమే కాకుండా తన భర్త రెండో వివాహంకు సిద్ధమైనట్లు తెలిసిందని పేర్కొంటూ అనిత సీపీకి ఫిర్యాదు చేశారు.

అగ్నిప్రమాదం

కరీంనగర్‌క్రైం: నగరంలోని క్రిస్టియన్‌కాలనీలోని సాయికృష్ణ ఇంట్లో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఇళ్లంతా వ్యాపించడంతో ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పేశారు. ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదని ఫైర్ స్టేషన్ అధికారి పరమేశ్వర్ తెలిపారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భగత్‌నగర్, శివాలయం, పెద్దమ్మగుడి, వెంకటేశ్వరకాలనీ, విఘ్నేశ్వరకాలనీ, ఫకీరువాడ, ఎర్రగుట్టపల్లి ప్రాంతాలతో పాటు ఉదయం 10 నుంచి మ ధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ ఉజ్వల పార్కు ఫీడర్ పరిధిలోని ఉజ్వల పార్కు, డీర్ పార్కు, ఎన్టీఆర్ విగ్రహం వెనుక భాగం, బైపాస్ రోడ్, ఆటోనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా ఉద యం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు 11కేవీ టవర్‌సర్కిల్, ఎల్లమ్మ ఫీడర్ల పరిధి లోని టవర్‌సర్కిల్, రాజీవ్‌చౌక్, రూరల్ పోలీ స్‌స్టేషన్, బోయవాడ, పోచమ్మవాడ, ఆటోనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ నరేందర్ తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘం కార్యవర్గం



ఎన్నిక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి కరణ్

కరీంనగర్‌రూరల్: గొర్రెల పెంపకందారుల సహకార సంఘం గోపాల్‌పూర్ గ్రామ నూతన కార్యవర్గాన్ని శనివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిగుర్ల కొమురయ్య, కార్యదర్శిగా మెండె రాజయ్య, డైరెక్టర్లుగా ఏగుర్ల కనుకయ్య, పేరం మహేశ్, తొంటి మధు, కాసు పద్మ, మెండె దేవమ్మ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సబ్ రిజిస్ట్రార్ కరణ్‌కుమార్ ప్రకటించి ధృవీకరణ పత్రాలు అందించారు. కార్యవర్గాన్ని గొర్రెపెంపకందారుల సంఘం ప్రతినిధులు కడారి అయిలయ్య, బుచ్చన్న, చిగుర్ల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.